ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఆగస్టు 2024

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- ప్రజాకాంక్షలకు అనుగుణంగా పాలన
- అభివృద్ధి జరిగితేనే ఆదాయం పెరుగుదల
- జవాబుదారీతనంతో కష్టపడి పనిచేద్దాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపు
- అట్టహాసంగా స్వాతంత్ర్య వేడుకలు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీక్రిష్ణ

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం



స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, ఆగస్టు 15 : అన్నిరంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. అనంత జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాలు అట్టహాసంగా కొనసాగాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని, అలాంటి మహనీయుల స్ఫూర్తితో దేశాభివృద్ధికోసం ముందుకు సాగుదామని తెలిపారు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటాలు సాగించి ప్రాణాలు అర్పించిన మహనీయులందరికీ వందనాలు తెలియజేస్తున్నామని అన్నారు. మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, లాలాలజపతిరాయ్, భగత్‌సింగ్, చంద్రశేఖర్‌అజాద్ వంటి సమరయోధులు స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. అలాంటి ఉద్యమంలో అనంత జిల్లా నుంచి పప్పూరు రామాచార్యులు, కైప సుబ్రమణ్యశర్మ, గుత్తికేశవపిళ్లై, ఐదుకల్లు సదాశివన్, గుత్తి రామక్రిష్ణ, పెద్దగొంది కొండప్ప, జీవరత్నమ్మ, ఆదిశేషయ్య, హంపన్నలాంటి వారు ఎందరో పాల్గొనడం మన అందరి అదృష్టమన్నారు. అలాంటి మహనీయుల స్ఫూర్తితో మరింత జవాబు దారీతనంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.



భరతమాత వేషధారణలో యువతి..





ద్విచక్ర వాహనాలపై పోలీసుల విన్యాసం





జాగిలాలతో విన్యాసం..



విద్యార్థినుల మార్చ్‌ఫాస్ట్



పాల్గొన్న అతిథులు..



స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

1వ బహుమతి శకటం
వ్యవసాయశాఖ



2వ బహుమతి శకటం
వైద్య ఆరోగ్యశాఖ



3వ బహుమతి శకటం
గృహ నిర్మాణ శాఖ



● ప్రజాకాంక్షలకు అనుగుణంగా పాలన

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి కేశవ్ పేర్కొన్నారు. మంచిపాలన అంటే సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు వినూత్న ఆలోచనలు చేయాలని కోరారు. మంచి నిర్ణయాలు తీసుకుని ముందుకుసాగితే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గత పాలకుల చేతుల్లో రాష్ట్రం ఎంతో దెబ్బతినిందని, దీనిని పునర్నిర్మించాలనే టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ నేపథ్యంలో అందరం జవాబుదారీతనంతో లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అభివృద్ధి జరిగితేనే ఆదాయ వనరులు పెరుగుతాయని, అందుకే ఓవైపు సంక్షేమం, ఇంకోవైపు అభివృద్ధి సాగిస్తూ ప్రజలు మెచ్చే విధంగా పాలన అందిద్దామని తెలిపారు. మానవతా దృష్టితో ఆలోచిస్తే సమస్యలను పరిష్కరించవచ్చునని, కష్టపడి పనిచేస్తే 2047నాటికి ప్రపంచంలోనే మనం నెంబర్‌వన్‌గా ఉంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

● ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట

రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక సమస్యలు ఉన్నా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సాగుతోందని మంత్రి కేశవ్ చెప్పుకొచ్చారు. అధికారం చేపట్టిన తొలి రోజే మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఎన్టీఆర్‌భరోసా పించన్లపెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, యువతకు నైపుణ్యగణన ఫైళ్లపై సీఎం చంద్రబాబునాయుడు సంతకాలు చేశారని గుర్తుచేశారు. ఆ మేరకు తొలినెల నుంచే పెంచిన పింఛన్లు రూ.3వేల నుంచి 4వేలు, వికలాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు, పూర్తి నడవలేక మంచానికే పరిమితమైనవారికి రూ.5వేల నుంచి రూ.15వేలు పెంచి ఇచ్చామని తెలిపారు. మాట ప్రకారం మూడునెలల అదనపు సొమ్ము కలిపి ఇచ్చామని చెప్పారు. అనంత జిల్లాలోనే ప్రతినెలా 2,87,656 మంది పింఛన్‌దారులకు రూ.126 కోట్లు అందిస్తున్నామని అన్నారు. పాత ఇసుక విధానాన్ని రద్దుచేసి ఉచితంగా సరఫరా చేస్తున్నామని వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొదుపు సంఘాలకు రూ.224 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. చంద్రన్నబీమా పథకం కింద జిల్లాలో 5,93,415 కుటుంబాలను నమోదు చేశామన్నారు. అంగన్‌వాడీల ద్వారా 1,78,958 మందికి పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్డులో పేరున్న ప్రతిఒక్కరి ఆరోగ్యం కోసం రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందిస్తామన్నారు.

● అన్నదాతలకు అండగా..

అన్నదాతలను అన్నివిధాలుగా ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కేశవ్ అభయమిచ్చారు. పీఎంకిసాన్ పథకం కింద జిల్లాలో 2024-25కు గాను తొలివిడతలో 2.77లక్షల రైతు కుటుంబాలకు రూ.555 కోట్లు వారి ఖాతాల్లోకి జమచేశామని తెలిపారు. జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాల ద్వారా 4,774 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందించామన్నారు. ఈ ఖరీఫ్ పంట కాలంలో 86,304 మంది రైతులకు 76,137క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను రూ.28.90 కోట్ల సబ్సిడీతో అందించామని అన్నారు. వంద శాతం డ్రిప్పు వాడుతున్న జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ ఏడాది 37,500 హెక్టార్లకు సూక్ష్మ నీటి పరికరాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వంద చిన్నతరహా నీటిపారుదల చెరువుల్లో చేపలపెంపకం, పశువుల ఉత్పత్తి కోసం 70 శాతం రాయితీతో పాడిపశువుల షెడ్లు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. బోరుబావులకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా, హంద్రీనీవా నీటిద్వారా చెరువులు నింపడం, పీఏబీఆర్, ఎంపీఆర్, చాగల్లు రిజర్వాయర్లను నింపి చివరి ఆయకట్టు వరకు సాగు, తాగునీటిని అందిస్తామని తెలిపారు. నిరుపేదలకు ఇళ్లు, పంచాయతీల అభివృద్ధి, రహదారుల నిర్మాణాలు, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి పరిశ్రమలు స్థాపనకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. విజన్ అనంతపురం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి 2047నాటికి జిల్లాను అన్నిరంగాల్లోనూ అగ్రస్థానంలో నిలపడానికి చిత్తశుద్ధితో పనిచేద్దామని అధికారులు, జిల్లా ప్రజలకు కేశవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీక్రిష్ణ, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, నగరప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేడుకలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 15 : దేశభక్తి గీతాలు... జాతి ఔన్నత్యాన్ని తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలతో 78వ స్వాతంత్ర్య దినోత్సవాలు గురువారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో అందరినీ అలరించాయి. ప్రధానంగా పోలీసు జాగిలాలు, అగ్నిమాపక శాఖ వారి విన్యాసాలు వీక్షకులను కట్టిపడేశాయి. ఈ వేడుకలకు రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. శకటాల ప్రదర్శనలో వ్యవసాయశాఖ శకటం ప్రథమ స్థానం, వైద్య ఆరోగ్యశాఖ ద్వితీయ, హౌసింగ్ శాఖ తృతీయస్థానంలో నిలిచాయి. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ద్వారా ఆయా శాఖల సేవలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆత్మకూరు కేజీబీవీ, గొల్లపల్లి మాంటిస్సోరీ పాఠశాలల విద్యార్థులు ప్రథమస్థానం, కూడేరు కేజీబీవీ విద్యార్థులు ద్వితీయస్థానం, అనంతపురం కేఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం గెలుపొందారు. పరేడ్ విభాగంలో స్పెషల్ పార్టీ పోలీసులు ప్రథమ, గురుకులం బాలికల బృందం ద్వితీయ, ఏఆర్ కంటిజెంట్స్ తృతీయస్థానాల్లో నిలిచారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీకృష్ణ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రసంగించారు. స్టాల్స్‌ను సందర్శించారు. స్టాల్స్ ప్రదర్శనలో మొదటిస్థానంలో ఐసీడీఎస్, ద్వితీయ స్థానంలో మత్స్యశాఖ, తృతీయస్థానంలో ఏపీఎంఐపీ గెలుపొందగా, ఆయా శాఖల జిల్లా అధికారులకు జ్ఞాపికలు అందజేశారు.



త్యాగధనుల స్ఫూర్తితో ప్రజలకు సేవలందిద్దాం: ఎస్పీ

అనంతపురం క్రైం,ఆగస్టు 15: దేశం కోసం పాటుపడిన త్యాగధనుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, విధుల్లో పునరంకితమై ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను గుర్తుచేసుకుని విధులు నిర్వహిద్దామన్నారు. అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, సీఐలు ధరణికిశోర్, ఇందిర పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న డీఐజీ.. ఎస్పీ అధికారులు

డీఐజీ కార్యాలయంలో...

అనంతపురం రేంజ్ డీఐజీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఐజీ షిమోసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు, పోలీసులకు శుభాకాంక్షలు తెలిపారు.

బోయరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

రస్తా విషయమై ఘర్షణ

రాళ్లు రువ్వుకున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు

పదిమందికి గాయాలు



రాళ్లు రువ్వుకుంటున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు





గాయపడిన కొత్తయ్య, శ్రీనివాసులు

యాడికి, ఆగస్టు 15: మండలంలోని బోయరెడ్డిపల్లిలో రస్తా విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయులు గురువారం రాళ్లు రువ్వుకున్నారు. రాళ్ల దాడుల్లో ఇరువర్గాలకు చెందిన 10 మంది గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని వైసీపీ వర్గానికి చెందిన గురుమోహన్‌కు బొగ్గుబట్టీలున్నాయి. వాటి వద్దకు వెళ్లాలంటే టీడీపీ వర్గీయులు నాగేశ్వర, ప్రసాద్, శ్రీనివాసులు పొలంలో ఎద్దులబండ్ల జాడ మాత్రమే ఉంది. టీడీపీ వర్గీయులు పొలంలో పత్తిపంట సాగు చేశారు. గురువారం బొగ్గుల లోడ్ లారీ పత్తిపంటను నాశనం చేసుకుంటూ వెళ్లింది. దీనిపై టీడీపీ వర్గీయులు గ్రామంలోకి వెళ్లి వైసీపీ వారిని నిలదీశారు. ఇరువర్గీయుల మధ్య మాటామాటా పెరిగి, రాళ్లదాడి చేసుకున్నారు. దీంతో టీడీపీకి చెందిన శ్రీనివాసులు, శివగంగరాజు, కొత్తయ్య, వెంకటరమణ, ప్రసాద్, నవీన్, వేణు, వైసీపీ వర్గంలోని రవి, ఓబులేసు, రామచంద్ర గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్థులు భయం గుప్పిట్లో ఉన్నారు. యాడికి సీఐ నాగార్జునరెడ్డి గ్రామానికి వెళ్లి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. టీడీపీ, వైసీపీకి చెందిన 32 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. టీడీపీకి చెందిన శివగంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులు 20 మందిపై కేసు కట్టారు. వైసీపీకి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు 12 మందిపై కేసు నమోదు చేశామని ఆయన వెల్లడించారు.

పురస్కారాల సంబరం..

అనంతపురం జిల్లా...



ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం, పుట్టపర్తిలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో సేవా పురస్కారాల ప్రదా నోత్సవం సంబరంలా సాగింది. ఇరు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉ ద్యోగులకు పురస్కారాలు అందజేశారు. అనంతపురం లో మంత్రి పయ్యావుల కేశవ్, పుట్టపర్తిలో మంత్రి సవిత ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. పురస్కారాలు అందుకున్న వారు కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకోవడం కనిపించింది. అందుకు సంబంధించిన చిత్రమాలిక ఇది.

అనంతపురం కల్చరల్/పుట్టపర్తి



అనంతపురంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో పోలీసుల గౌరవ వందనం

శ్రీసత్యసాయి జిల్లా



మంత్రి సవిత నుంచి సేవాపురస్కారం అందుకుంటున్న పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్



అటవీశాఖాధికారి వినీత్‌కుమార్ | డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి | స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష | అనంతపురం ఆర్డీఓ వసంతబాబు



పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ | ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డి | కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ | జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు



గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి | కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుశ్మిత | అగ్రికల్చర్ అధికారి ఉమామహేశ్వరి | కోఆపరేటివ్ అధికారి అరుణకుమారి | డీటీసీ వీర్రాజు | ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ | ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి | డీఎంహెచ్‌ఓ దేవి | డీపీఓ ప్రభాకర్‌రావు | అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి



ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్ | మైక్రోఇరిగేషన్ అధికారి సుదర్శన్ | పట్టుపరిశ్రమలశాఖ అధికారి పద్మావతమ్మ | శుభదాసు పశుసంవర్ధక శాఖ | మత్స్యశాఖ అధికారి, చంద్రశేఖర్‌రెడ్డి | అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి



స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్యం వారసుడు విరల్ | బాస్కెట్‌బాల్ ప్లేయర్ ద్వారకానాథ్‌రెడ్డి | సీఐ జాకీర్ హుస్సేన్ | శ్రీనివాసులు కంప్యూటర్ ఆపరేటర్ | సుజాత, అకౌంటెంట్ | మధురలాలస సర్వే ఆఫీసర్ | ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి | సెబ్ ఏఎస్పీ రామకృష్ణ | ఎస్‌డీపీఓ ప్రతాప్‌కుమార్ | ఎస్‌డీపీఓ శివారెడ్డి



భూగర్భ జలవనరుల అధికారి మల్లికార్జునరావు | మార్కెటింగ్ అధికారి ఎంఎల్ఎన్ మూర్తి | డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి | సివిల్‌సప్లై అధికారి అశ్వత్థనాయక్ | డీఎంహెచ్‌ఓ మంజువాణి | డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్



ఎస్‌డీపీఓ రవిబాబు | ఎస్‌డీపీఓ శివ భాస్కర్‌రెడ్డి | ఎస్‌డీపీఓ జనార్దన్‌నాయుడు | ఏఆర్ డీఎస్పీ మునిరాజు | స్పెషల్‌బ్రాంచి సీఐ ఇందిర | సీఐ ఇస్మాయిల్ | సీఐ దేవానంద్ | లీగల్ అడ్వకేట్ విష్ణువర్ధన్‌రెడ్డి | పీఆర్‌ఓ దామోదర్ | ఎస్ఐ నాగమధు



డీఆర్‌డీఏ పీడీ నరసయ్య | డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ | ఎస్సీ వెల్ఫేర్ శివరంగప్రసాద్ | ట్రైబల్ వెల్ఫేర్ మోహన్‌రాం | బీసీ వెల్ఫేర్ నిర్మలాజ్యోతి | హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ అధికారి రమేష్



డీటీ సోమశేఖర్ | ఎస్ఐ ఆంజనేయులు | స్పెషల్ పీపీ సుజన | ఎంపీడీఓ షకీలాబేగం | అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాబా ఫకృద్దీన్ | సీడీపీఓ డిల్లీశ్వరి | హైమావతి అగ్రికల్చరల్‌శాఖ | జయరాం నాయక్ | ఫారెస్ట్‌సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్ | విజయలక్ష్మి డ్వామా



డీఈఓ మీనాక్షి | డీపీఓ విజయ్ కుమార్‌రెడ్డి | హౌసింగ్ డీఈ వెంకటనారాయణ | రవాణాధికారి కరుణాసాగర్‌రెడ్డి | నోడల్ అధికారి శివారెడ్డి | కోఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్



విద్యుత్‌శాఖ ఈఈ జేవీ రమేష్ | అంజుమన్ షఫ్రీన్ | శ్రీవిద్య పశువైద్యాధికారి | డాక్టర్ భీమసేనాచారి | వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు | డాక్టర్ సురేష్ | అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ | మెడికల్ అధికారి మాధవ | పారిశ్రామిక శాఖ సుజన | ఈఈ సురేంద్రబాబు



దేవదాయశాఖ అధికారి నరసింహరాజు | పరిశ్రమల అధికారి చాంద్‌బాషా | ఆహారభద్రత అధికారి రామచంద్ర | శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హిందూపురం | రాంకుమార్, మున్సిపల్ కమిషనర్ ధర్మవరం | వంశీకృష్ణభార్గవ్ పెనుకొండ మున్సిపల్ కమిషనర్



విష్ణుప్రియ లెక్చరర్ | శ్రీధర్ లెక్చరర్ | పీఆర్‌ఓ సూర్య నారాయణరెడ్డి | ఫెన్సింగ్ కోచ్ లక్ష్మీదేవి | ఏఈఈ కావ్య | ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ | ఎస్టీఓ లక్ష్మి | ఎక్సైజ్ శాఖ ఏ రమేష్ | ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి | రమేష్ సుంకర



రెడ్‌క్రాస్ ఆలంభన జనార్దన్‌రెడ్డి | మల్లికార్జున హోంగార్డ్ | మల్లేష్ ఏఆర్ ఎస్ఐ | సరస్వతి కానిస్టేబుల్ | మల్లికార్జున కానిస్టేబుల్ | రాము కానిస్టేబుల్



లక్ష్మీనారాయణ హెడ్‌కానిస్టేబుల్ | హరినాథ్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ | ఎస్సీ వెల్ఫేర్ వెంకటలక్ష్మి | పరదేశీ నాయుడు | శింగనమల వార్డన్ మస్తాన్ | చలంబాబు హెడ్‌కానిస్టేబుల్ | రామచంద్ర, హెడ్‌కానిస్టేబుల్ ఎక్సైజ్



ఐఎస్‌ఓ ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎస్‌ఓ శోభారాణి

జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

అనంతపురం క్రైం, ఆగస్టు 15: స్థానిక జిల్లా కోర్టులో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మధరావు.. జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



జిల్లా కోర్టులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి మన్మధరావు

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం,ఆగస్టు 15 : అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఉమ్మడి జిల్లాల పరిధిలో సీఐల బదిలీలు జరిగాయి. ఆ వివరాలివీ..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
నాగేంద్రప్రసాద్	తాడిపత్రి అర్బన్	ధర్మవరం వన్‌టౌన్
సాయిప్రసాద్	ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్,కర్నూలు	తాడిపత్రి అర్బన్
రెడ్డప్ప	వన్‌టౌన్,అనంతపురం	ధర్మవరం టూటౌన్
అశోక్‌కుమార్	ధర్మవరం టూటౌన్	వీఆర్‌ఎస్పీ, శ్రీసత్యసాయి
ప్రభాకర్	ఏసీబీ,అనంతపురం	ధర్మవరంరూరల్ సర్కిల్
ఆరోహణరావ్	ధర్మవరం రూరల్ సర్కిల్	వీఆర్,ఎస్పీ, శ్రీసత్యసాయి
అబ్దుల్‌కరీమ్	వీఆర్,ఎస్పీ కడప	హిందూపురం టూటౌన్
నాగేంద్ర	దిశ,ఉమెన్, రాయచోటి	కదిరి రూరల్ సర్కిల్
కౌలుట్లయ్య	సీఐడీ, ఆర్వో, కర్నూలు	శింగనమల సర్కిల్
మనోహర్	మడకశిర	గుంతకల్లు వన్‌టౌన్
రామసుబ్బయ్య	గుంతకల్లు వన్‌టౌన్	వీఆర్,ఎస్పీ,అనంతపురం
శివగంగాధర్‌రెడ్డి	ఏసీబీ, అనంతపురం	తాడిపత్రిరూరల్
లక్ష్మీకాంతరెడ్డి	తాడిపత్రి రూరల్ పీఎస్	వీఆర్,ఎస్పీ,అనంతపురం
ఈరన్న	వీఆర్,ఎస్పీ, శ్రీసత్యసాయి	యాడికి యూపీఎస్
నాగార్జునరెడ్డి	యాడికి యూపీఎస్	వీఆర్ ఎస్పీ,అనంతపురం
వెంకటేశ్వర్లు	వీఆర్, ఆర్వో, అనంతపురం	గుత్తి యూపీఎస్
వెంకటరమణ	ప్రొద్దుటూరు త్రీటౌన్	రాయదుర్గం రూరల్
సంజీవకుమార్	మహిళా పీఎస్,అనంతపురం	ట్రాఫిక్ పీఎస్,తిరుపతి

రోబోట్ పంపులతో రైతన్నకు సంతోషం

తాడిపత్రి, ఆగస్టు15: రోబోట్ పంపుల వాడకంతోనే రైతులకు సంతోషం ఉంటుందని రోబోట్ కంపెనీ డైరెక్టర్ సాగర్ సువాగియా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ లితేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని బస్టాండు సమీపాన గురువారం న్యూ శ్రీహరి ఇంజనీరింగ్ స్టోర్‌ను సాగర్ సువాగియా జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం రైతులు, మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రోబోట్ పంపులు అత్యంత నాణ్యతాప్రమాణాలతో తయారు చేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ మెంబరు వెంకటరెడ్డి, దుకాణ యజమానులు రాఘవేంద్ర, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న రోబోట్ కంపెనీ డైరెక్టర్ తదితరులు



సూర్య హాస్పిటల్ ప్రారంభం




ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్ ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం టౌన్, ఆగస్టు 15: నగరంలోని సాయినగర్ 9వ క్రాస్, అంబేడ్కర్ భవన్ సమీపాన అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన సూర్య హాస్పిటల్, సాయిడయాగ్నస్టిక్ సెంటర్‌ను గురువారం రాత్రి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. కరువు జిల్లా అనంతలో అధునాతన వైద్యపరికరాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత పరిటాల శ్రీరామ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధర్మవరపు సూర్యప్రకాష్, డాక్టర్ తమ్మినేని సాయికిరణ్మయి, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ పీవీ రమణ పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

అనంతపురం జిల్లా : ఆగస్టు 15: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర,శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

స్వాంతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి: డీఆర్ఎం

గుంతకల్లు, ఆగస్టు 15: స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే గ్రౌండులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు డీఆర్ఎం రైల్వే గ్రౌండులో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆర్పీఎఫ్, స్కౌట్స్ శాఖల క్యాడెట్ల సైనిక వందనాన్ని స్వీకరించి జీఎం పంపిన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా రైల్వే పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానిక జీఆర్పీ ఎస్పీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ చౌడేశ్వరి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందికి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ అజీజ్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘ నాయకుడు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న డీఆర్ఎం విజయ కుమార్

జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి



విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలి



ననకోట ఎంజేపీ పాఠశాలలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 15: విద్యార్థి దశ నుంచే అన్ని రంగాలపై అవగాహన పెంచుకుని ముందుకెళ్లాలని స్వాతంత్రదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని ననకోట మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర సరయోధుల చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా తిలకించారు. పాఠశాలలో తన తండ్రి ధర్మవరపు కొండన్న పేరు మీదుగా రూ.5లక్షలు సొంత నిధులతో డయాస్ నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి రూ.50వేలు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు.

టీడీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 15: స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల గురించి యువత తెలుసుకోవాలన్నారు. నాయకులు రాయల్ మురళీ, డిష్ నాగరాజు, రాజారావు, పీఎం లక్ష్మీప్రసాద్, ఓంకార్‌రెడ్డి, కడియాల కొండన్న పాల్గొన్నారు.

జిల్లా కార్యాలయంలో..



జెండా వందనం చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్: రాంనగర్‌లోని తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, గడ్డం సుబ్రహ్మణ్యం, సరిపూటి సూర్యనారాయణ, కూచి హరి, సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్, గుర్రం నాగభూషణం పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కేశవరెడ్డి తదితరులు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 15: యువత దేశ భక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యేతో పాటు ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఆలం వెంకటనరసానాయుడు హాజరై జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ తేజోత్స్న, కన్వీనర్ అశోక్, రవీంద్రా, లక్ష్మీనారాయణ, జీసీబాబు, కేశన్న, ఎస్‌నారాయణస్వామి, ఓబులపతి, మల్లికార్జునరెడ్డి, ఆదెప్ప, మల్లెష్, సోముశేఖర్, నరేంద్రయాదవ్, ప్రధానోపాధ్యాయరాలు వసుంధర పాల్గొన్నారు.

త్యాగధనుల కృషి ఫలితమే స్వాతంత్ర్యం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న టీసీ వరుణ్, జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు15: ఎందరో జాతీయ నేతలు తమ ప్రాణాలను త్యాగం చేసిన ఫలితమే స్వాతంత్ర్యమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, మురళీకృష్ణ, గ్రంధి దివాకర్, సదానందం, జక్కిఆదినారాయణ, రాపా ధనుంజయ, సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్దు, జయమ్మ, విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, రొళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

మడి దున్నుతుండగా... ట్రాక్టర్ బోల్తా

● వైసీపీ నాయకుడి మృతి

చెన్నేకొత్తపల్లి,ఆగస్టు 15: మండలంలోని పులేటిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుల్లారెడ్డి(68) గురువారం మడిని దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు సొంత వ్యవసాయ తోటలో వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్నాడు. ఉన్నపలంగా ట్రాక్టర్ తిరగబడి మీద పడటంతో బురదలో కూరుకుపోయాడు. అక్కడున్న వారు వెంటనే బయటకుతీసి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పుల్లారెడ్డికి భార్య పరిమళ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ జూనియర్ లైన్‌మన్ మృతి

రాప్తాడు, ఆగస్టు 15: విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌తో కింద పడి చికిత్స పొందుతూ జూనియర్ లైన్‌మన్ పి. మాధవయ్య గురువారం మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన మేరకు అనంతపురానికి చెందిన మాధవయ్య అయ్యవారిపల్లి, గంగలకుంట, ప్రసన్నాయపల్లి గ్రామాలకు విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేసేవాడు. జూలై 22న రామినేపల్లి గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేసేందుకు 11 కేవీ విద్యుత్ స్తంభం ఎక్కాడు. మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇండెక్షన్‌కు విద్యుత్ సరఫరా అయ్యి ఆయనకు షాక్ కొట్టింది. ఆయన స్తంభం మీద నుంచి కిందపడిపోయాడు. అనంతపురం శివార్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మాధవయ్య భార్య, ముగ్గురు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

జేఎన్‌టీయూలో పలువురు బాధ్యతల స్వీకరణ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 15: జేఎన్‌టీయూలో పలువురు ప్రొఫెసర్‌లు గురువారం బాధ్యతలు చేపట్టారు. రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా వైశాలి గోర్పడే, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్‌గా చెన్నారెడ్డి బాధ్యతలు చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య మాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించి వర్సిటీ అభివృద్ధికి దోహదపడతామని వారు పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్లు, ప్రొఫెసర్‌లు, డీఆర్‌లు, ఏఆర్‌లు, ఇతర ఉద్యోగులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

మురిసిన త్రివర్ణ పతాకం

జిల్లాలో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితమే దేశానికి స్వాతంత్ర్యమని, స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తితో ముందుకెళ్లాలని పలువురు వక్తలు సూచించారు. వివిధ పాఠశాలల్లో స్వాతంత్ర్య యోధుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



నెహ్రూ వేషధారణలో చిన్నారి



జెండా వందనం చేస్తున్న అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పీవీ రమణ



ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

గౌరవ వందనం చేస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి

జెండాను ఎగురవేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ వినీత్ కుమార్..



జెండా వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకుడు జగదీష్



జడ్పీలో చైర్‌పర్సన్ గిరిజమ్మ



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్‌డీఓ, కోచ్‌లు



బీజేపీ కార్యాలయంలో...



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు



జెండా ఎగరవేస్తున్న చైతన్య స్కూల్ ఏజీఎం సుబ్బారెడ్డి



మినర్వా స్కూల్ వేడుకలో కరస్పాండెంట్, విద్యార్థులు



ఎస్వీ డిగ్రీ కళాశాలలో జెండా ఎగురవేస్తున్న చక్రధర్‌రెడ్డి



ఎస్ఆర్ స్కూల్‌లో వేడుకలు



రామకృష్ణ విద్యాలయంలో చిన్నారుల ర్యాలీ



ఆదర్శ్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ చిన్నారుల స్వాతంత్ర్య ఘట్టాల డ్రాయింగ్స్



బచ్‌పన్‌లో స్కూల్‌లో...



రుద్రంపేట శ్రీచైతన్య స్కూల్‌లో జెండా ఎగరవేస్తున్న ప్రిన్సిపాల్



నవభారత్ స్కూల్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు



రాప్తాడు టీడీపీ కార్యాలయంలో...



లలితకళాపరిషత్‌లో కల్లూరు సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం



పీవీకేకేలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు



ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో...



ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో..



నార్పలలో జెండా వందనం చేస్తున్న ఆలం వెంకట నరసానాయుడు



ఆత్మకూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు



సీకేపల్లిలో ఉపాధి పనుల వద్ద స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్న కూలీలు



సీకేపల్లిలో 500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న రాఘవేంద్ర ప్రైవేటు పాఠశాల విద్యార్థులు



గుమ్మేపల్లిలో జెండా వందనం చేస్తున్న సర్పంచ్



శింగనమలలో 600 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గార్లదిన్నె కేజీబీవీలో..



తగరకుంటలో జెండా ఎగురవేస్తున్న సర్పంచ్ మాధవరాజు

రావమ్మా.. వర మహాలక్ష్మి..

● నేడు వరలక్ష్మీ వ్రతం...

● పూజాసామగ్రి కొనుగోళ్లతో జనం బిజీ.. బిజీ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 15: రావమ్మా... వరలక్ష్మీ మా ఇంటికి... అంటూ అమ్మవారిని ఆహ్వానిస్తూ ముత్తైదువులు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నారు. ప్రతిఏటా శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీదేవిని ఆరాధిస్తూ వ్రతాలను ఆచరించడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం. సంకల్పం, సహస్రనామార్చనాది పూజలను నిర్వహిస్తారు. 9 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. 9 ముడులతో తయారుచేసిన కంకణాలను అమ్మవారి ముందు వుంచి పూజిస్తారు. పూలతో అలంకరించిన ఈ కంకణాలను పూజల్లో పాల్గొన్న ముత్తైదువుల కుడిచేతికి కట్టి, పిండివంటలను వాయినాలుగా అందజేయడంతో వ్రతం పరిసమాప్తమవుతుంది.



పూజాసామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన పాతూరు

విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐగా విశ్వనాథచౌదరి

అనంతపురంరూరల్, ఆగస్టు 15: విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐగా విశ్వనాథ్ చౌదరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతిలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తూ- ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డిని కర్నూల్ డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు అందాయి.

సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకే కేటాయించాలి

అనంతపురం అర్బన్, ఆగస్టు 15: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరినీ మాతృశాఖలకు కేటాయించి విధులు నిర్వర్తించేలా చూడాలని ఆ సంఘం నాయకులు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను కోరారు. గురువారం విజయవాడలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు ఉపాధ్యక్షుడు మహేష్, గనేష్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ ఆయన్ను కలిసి పలు సమస్యలను వివరించారు.

ఏసీబీ సీఐ బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం,ఆగస్టు 15: ఏసీబీలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సీఐ ప్రభాకర్‌ను ఎట్టకేలకు బదిలీ చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు ఉన్నతాధికారులు స్పందించారు. బుధవారం అర్ధరాత్రి అనంతపురం రేంజ్ పరిధిలో 35మంది సీఐల బదిలీలు జరగగా అందులో ఏసీబీ సీఐను బదిలీ చేశారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం ప్రాంతానికి బదిలీ చేశారు. ఆరోపణలున్నా పోలీస్‌స్టేషన్‌కు సీఐగా కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పై స్థాయిలో ఉన్నతాధికారి ఆశీర్వాదమే ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా రావడానికి కారణమైందనే ఆరోపణలున్నాయి. నిజాయితీగా వ్యవహరిస్తారనే పేరున్న డీఐజీ ఈ విషయంలో ఎందుకు పొరపాటు చేశారనే అంశంపై చర్చ సాగుతోంది.

కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయండి

అనంతపురం విద్య, ఆగస్టు 15: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని జిల్లా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. గురువారం ఆ సంఘం నాయకులు మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. మూర్తి, బాలకృష్ణ, యాషిన్‌పీర్, కాంతారావు, రామాంజనేయులు, రాజులు, మక్బూల్‌జాన్, కృపానంద పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 15: జిల్లా కేంద్రంలోని పవర్ ఆఫీస్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8 నుంచి 10గంటల వరకు భవాని నగర్, సంగమేష్ నగర్, అనంతసాగర్ కాలనీ, గాంధీ బజార్, రాణి నగర్, సూర్యనగర్, అంబేడ్కర్ నగర్, వైఎస్సార్ కాలనీ, మున్నానగర్, ముసలమ్మకట్ట, పాతవూరు, ఆసార్ గేట్, ఉమానగర్, తిలక్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆంధ్రా క్రికెట్ శిక్షణ శిబిరానికి ముగ్గురు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 15: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మహిళల క్రికెట్ శిక్షణా శిబిరానికి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. 2024-25 సీజన్‌కు సంబంధించి ఆంధ్రా అండర్-19 మహిళల జట్టుకు జిల్లా నుంచి అర్షియానేహా, బినేహా, తరుణం అర్హత సాధించారు. ఈనెల 20వ తేదీ నుంచి విజయవాడలో నిర్వహించే శిక్షణా శిబిరానికి వీరు హాజరుకానున్నారు. ఎంపికైన క్రీడాకారిణులకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

మొక్కలు నాటిన చిరంజీవి యువత నాయకులు



మొక్కలు నాటుతున్న భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్ క్లబ్, ఆగస్టు15: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అఖిలభారత చిరంజీవి యువత నాయకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. చంద్రమౌళి, అంగటి వెంకట చలపతి, ఇమామ్ హుస్సేన్, షామీర్, జేకే రమేష్, అక్కిరాజు సాగర్, తిమ్మప్ప, ఆరీఫ్, ఖాదర్‌వలి, చరణ్, కార్తీక్, సాయి చరణ్, కృష్ణ, జతిన్, బాషా, సర్ఫ్రోజ్ పాల్గొన్నారు.

వైద్యురాలి హత్య దారుణం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ని మానభంగం చేసి కత్తులతో దాడి చేసి హతమార్చడం దారుణమని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. డాక్టర్ హత్యకు నిరసనగా హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో నిరసన తెలుపుతున్న డాక్టర్లకు ఆయన మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళా డాక్టర్ హత్యకు కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 28: జిల్లాకేంద్రంలోని నగరపాలక కార్యాలయం ఎదుట ఉన్న రియా ఆస్పత్రిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం చివరి రోజు పెద్దఎత్తున ప్రజలు తరలిరాగా వారికి డాక్టర్లు ఎం ఉదయ్‌కుమార్, గీతస్వర్ణ చికిత్సలు అందించారు. ఆర్‌బీఎస్, వీపీటీ, బీపీ, బీఎం-1 టెస్టులు ఉచితంగా యశారు. అత్యంత కీలకమైన పరీక్షలు తక్కువ ధరకే చేయించి అవసరమైన వైద్య చికిత్సలు అందించారు. సేవా భావంతో పేదలకు తమవంతు వైద్యసహాయం అందించాలనే ఉద్దేశ్యంతో చికిత్సలు అందిస్తున్నామని డాక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకోండి

ఎమ్మెల్యే కాలవ



అరబిక్ కళాశాలలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఆగస్టు 15: సమాజంలో పేద, ధనిక అంతరాలను తొలగించేందుకు ఆర్థిక ఎదుగుదల ఉన్న వారు పేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పట్టణంలోని మున్సిపల్, టీడీపీ కార్యాలయాల్లో, అరబిక్ కళాశాలలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదరికం లేని సమాజం నిర్మించడమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని పిలుపునిచ్చారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

ఎమ్మెల్యే జేసీ

తాడిపత్రి, ఆగస్టు15: పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం మనం జీవిస్తున్న ఈ స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఎందరో మహనీయుల త్యాగ ఫలం అని తెలిపారు. మనమందరం వారిని స్మరించుకోవాలని అన్నారు.



గాంధీచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి

ఎమ్మెల్యే అమిలినేని



స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం, ప్రజావేదిక, మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం నియోజకవర్గంలోని అన్నిగ్రామాలకు రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రైతుల కోసం బీటీపీ-కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి 114 చెరువులకు నీరందిస్తామన్నారు. రైతులు సమస్యలను నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లానని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స కోసం ఇచ్చే స్టైమి ఇంజెక్షన్‌ను ప్రారంభించారు.

విద్యార్థినికి సన్మానం

విడపనకల్లు, ఆగస్టు 15: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో చదివిన విద్యార్థిని ఎం వందన అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించటం పాఠశాలకే గర్వ కారణమని ప్రధానోపాధ్యాయుడు సురేషబాబు పేర్కొన్నారు. భూటాన్‌లో గత జూలైలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వందనను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. షీల్డ్‌ను బహూకరించారు. కార్య క్రమంలో జడ్పీటీసీ సభ్యుడు హను మంతు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీనివాసు లు, వైస్ ఛైర్మన్ శాంతి, నాయకులు భీమిరెడ్డి, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.



వందనను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అట్టహాసంగా కేపీఎల్ ప్రారంభం

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 15: పట్టణంలోని స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం కళ్యాణదుర్గం ప్రీమియర్ లీగ్ అట్టహాసంగా ప్రారంభమైంది. గురువారం మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో కేపీఎల్ ప్రారంభించినట్లు తెలిపా రు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ప్రతిమ్యాచ్‌కి ఎనిమిది ఓవర్లు వుంటాయని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం రాత్రి పట్టణంలోని ఫ్లడ్ లైట్ల వెలుతురులో సాగుతున్న కేపీఎల్ మ్యాచ్‌ను పరిశీలించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సన్నీ రైజర్స్ క్రీడాకారుడు సురేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఎంతో ఉత్సాహంతో వందలాది మంది వీక్షించేందుకు వచ్చారు. ఈనెల 18 వరకు ఈ కేపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్‌కు రూ. లక్ష, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50 వేలు నగదు బహుమతులు ప్రకటించారు.



ప్రతిభ కనబరచిన క్రికెటర్‌కు మొమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

పెళ్లింట విషాదం



రామాంజనేయులు (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 15: మూడురోజుల్లో కుమార్తె పెళ్లి వేడుకలకు సిద్ధమవుతుండగా... ఆమె తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని బొల్లన గుడ్డం గ్రామానికి చెందిన పూరి రామాంజినేయులు(48) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేవాడు. అతడికి భార్య ఆదెమ్మ, కూతురు ఐశ్వర్య, కుమారుడు అభిషేక్ ఉన్నారు. కూతురికి అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయించారు. మూడు రోజుల్లో వివాహం. ఇంతలోనే గురువారం రామాంజినేయులు గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆ ఇంట విషాదం నెలకొంది. తండ్రి మృతితో ఐశ్వర్య పెళ్లి ఆగిపోయింది. మృతుడు రామాంజినేయులు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియల కోసం రూ. 25 వేలు నగదు అందించారు. మాజీ ఎంపీటీసీ గోపాల్, టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, మల్లికార్జున రామాంజనేయులు భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



బెళుగుప్పలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థుల ర్యాలీ



బొమ్మనహాళ్ కేజీబీవీలో విద్యార్థినుల విన్యాసం

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో అయా కార్యాలయాల అధికారులు, సంస్థల అధినేతలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమర యోధుల దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించారు.



గుంతకల్లు కోర్టు ప్రాంగణంలో జెండా ఆవిష్కరణలో న్యాయాధికారి మంజుల



గుంతకల్లు విజ్ఞాన్ పాఠశాలలో జెండా వందనం చేస్తున్న దృశ్యం



ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో కరస్పాండెంట్ కేసీ హరికుమార్



గుత్తిలో జెండా ఎగుర వేస్తున్న టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ



వజ్రకరూరులో జెండా వందనం చేస్తున్న అధికారులు



ఉరవకొండలో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి దుర్గా కల్యాణి



పామిడిలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి



విడపనకల్లులో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ సునీతాబాయి



కంబదూరులో జాతీయ నాయకుల వేషధారణలో శ్రీశారదా విద్యావిహార్ విద్యార్థులు



శెట్టూరు తహసీల్దార్ కార్యాలయంలో...



కుందుర్పి తహసీల్దార్ కార్యాలయంలో...



డీహీరేహాళ్ తహసీల్దార్ కార్యాలయంలో...



రాయదుర్గం కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి రమ్య



కణేకల్లులో జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు

ఢిల్లీ కోటలో అవార్డు అందుకున్న గోళ్ల సర్పంచ్

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 15 : దేశాభివృద్ధికి గ్రామాల్లో పట్టుకొమ్మలని గోళ్ల పంచాయతీ సర్పంచ్ కవిత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లకు పూర్తిగా మొండిచేయి చూపినా మొక్కవోని దీక్షతో ఆమె పంచాయతీలో సొంత నిధులతో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేశానని, అవే తనను దేశ రాజధానిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం పలకించాయన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్, ఆర్‌జీఎస్‌ఏ నోడల్ అధికారి వినోద్‌కుమార్ చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత పెరిగిందన్నారు.



అవార్డు అందుకుంటున్న గోళ్ల సర్పంచ్ కవితాబొజ్జన్న

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుమ్మఘట్ట, ఆగస్టు 15 : మండలంలోని బీటీపీ గ్రామంలో గురువారం మధ్యాహ్నం గొల్ల కావేరి(25) అనే మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందింది. కావేరి ఇంటి ఎదుట బట్టలు ఉతుకుతోంది. ఈ సమయంలో నీటిని తోడేందుకు ఇంట్లో ఉన్న సింగిల్ ఫేస్ మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కావేరి పుట్టినిల్లు బీటీపీ గ్రామం. కేపీకుంట గ్రామానికి చెందిన శివన్నతో వివాహమైంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు చరణ్ ఉండగా ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆమె మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

జీడిపల్లి రిజర్వాయరులో నీటి నిల్వ 0.413 టీఎంసీలు

బెళుగుప్ప, ఆగస్టు 15 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుత నీటినిల్వ 0.413 టీఎంసీలు ఉన్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 712 క్యూసెక్కులు ఉందన్నారు.

నీటమునిగి తరగతి విద్యార్థి...

కణేకల్లు, ఆగస్టు 15: మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన రవి అలియాస్ రాజేష్ అనే ఏడో తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తు వేదావతి హగరి నదిలో నీటిలో మునిగి మృతి చెందాడు. మాల్యం గ్రామానికి చెందిన అంబ్రేష్, లక్ష్మి కుమారుడైన రవి గురువారం స్థానిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాలు ముగించుకుని మిత్రులతో కలిసి వేదావతి హగరి నీటిలో ఈతకు వచ్చాడు. ప్రమాదవశాత్తు లోతుగా ఉన్న గుంతకలో మునిగాడు. రవికి ఈత రాకపోవడంతో కొద్దిసేపు నీటిలోనే కొట్టుమిట్టాడుతూ మునిగిపో యాడు. ఈ విషయాన్ని తోటి మిత్రులు అక్కడ ఉన్న వారికి తెలిపారు. వారు రవిని గుంత నుంచి బయటకు తీశారని, అయితే అతడు అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా తమ ఒక్కగా నొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.



విద్యార్థి రవి (ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత

పామిడి, ఆగస్టు 15: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో రైల్వే గేటు వద్ద గురువారం పెద్దఎత్తున రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వీఆర్‌కు యాడికి సీఐ

యాడికి, ఆగస్టు15: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగార్జునరెడ్డిని వీఆర్‌కు పంపారు. ఈ ఏడాది జనవరి 8న యాడికి యూపీఎస్ సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా సీఐ నాగార్జునరెడ్డిని వీఆర్, ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఉత్తర్వులు ఇచ్చారు. యాడికి సీఐగా ఈరన్నను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

కణేకల్లు, ఆగస్టు 15: మండలంలోని మారెంపల్లికి చెందిన ఈరమ్మ(31) అనే ఎనిమిది నెలల నిండు గర్భిణి భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి వన్నూరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మారెంపల్లికి చెందిన వన్నూరప్ప కుమార్తె అయిన ఈరమ్మను 13 ఏళ్ల క్రితం కర్ణాటకలోని దావణగెరకు చెందిన లింగరాజుకు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో రూ. 5 లక్షల కట్నం ఇచ్చారు. పెళ్లి తర్వాత కొన్ని సంవత్సరాలు కాపురం చేసిన భర్త నుంచి వేధింపులు ప్రారంభం కావడంతో అప్పట్లోనే ఈరమ్మ మారెంపల్లికి వచ్చింది. రెండేళ్ల తర్వాత పెద్దలు మరలా పంచాయతీ చేసి భర్త వద్దకు పంపారు. అప్పటికే వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్తతో కలిసి ఉంటున్న ఈరమ్మ ఆదివారం స్వగ్రామానికి వచ్చింది. అయితే ఫోన్‌లో భర్త వేధింపులు అధికం కావడంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.